ప్రజాశక్తి

సోమవారం 21 జూలై 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

స్పోర్ట్స్ ఎరీనాపై పర్యవేక్షణేదీ ?

- కాసులు కురిపిస్తున్నా.. అద్దె చెల్లించని ప్రైవేటు సంస్థ
- ఇప్పటికే రూ.2 కోట్ల పైచిలుకు బకాయి
- పట్టించుకోని ప్రభుత్వం
- కాంట్రాక్టు రద్దు చేసి జివిఎంసి స్వాధీనం చేసుకోవాలి : సిపిఎం

ఎంవిపి.కాలనీలోని స్పోర్ట్స్ ఎరీనా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా సుమారు రూ.25 కోట్ల నిధులతో ఎంవిపి. కాలనీలోని ఎకరం 40 సెంట్లు విస్తీర్ణంలో రెండు అంతస్తుల్లో నిర్మించిన ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాపై ప్రభుత్వ పర్యవేక్షణ కొరవడింది. ఫలితంగా ప్రయివేటు సంస్థ హవా ఇక్కడ నడుస్తోంది. క్రీడాకారుల నుంచి భారీగా ఛార్జీలు వసూలు చేసి లాభాలు గడిస్తున్న సదరు సంస్థ ఇప్పటి వరకూ రూ.2 కోట్ల అద్దె బకాయి పడింది. చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం అప్పుడప్పుడూ నోటీసులు ఇవ్వడం తప్ప చర్యలకు దిగడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

2022లో ఈ ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాను అధునాతన సౌకర్యాలతో నిర్మించారు. దీని మొత్తం భూమి విలువ రూ.100 కోట్లకు పైగా ఉంటుంది. మొత్తం ఎయిర్ కండిషన్‌తో కూడిన ఈ ఎరీనాలో బ్యాడ్మింటన్ కోర్టులు 6, బాస్కెట్ బాల్ కోర్టు 1, వాలీబాల్ కోర్టు 1, స్విమ్మింగ్ పూల్స్ 2, టేబుల్ టెన్నిస్ కోర్టులు 4, అత్యంత ఆధునిక జిమ్ ఉన్నాయి. యోగా, చెస్‌కు ప్రత్యేక సదుపాయాలు ఉన్నాయి.

ప్రైవేటుకు అప్పగించిన తరువాత..

ఈ స్పోర్ట్స్ ఎరీనాను ఆపరేషన్ - మెయింటినెన్స్ - మేనేజ్‌మెంట్‌ను 2023 నుంచి 5 ఏళ్లకుగాను కెకె కార్పొరేషన్ - మొబి కేర్ జాయింట్ వెంచర్ సంస్థకు అద్దె ప్రాతిపదికన ఇచ్చారు. ఈ అద్దెను ఏడాదిలో నాలుగు వాయిదాల్లో చెల్లించాలి. కానీ అలా జరగడం లేదు. ఆ సంస్థ ఇప్పటి వరకు సుమారు రూ.2 కోట్లు మిగతా 2లో..

వార్త 8లో..

మాట్లాడుతున్న లోకనాథం, చిత్రంలో జగ్గునాయుడు, కోటేశ్వరరావు తదితరులు

స్మార్ట్ మీటర్లు రద్దు చేయకుంటే

మరో విద్యుత్ ఉద్యమం

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం

భారీగా విదేశీ మద్యం పట్టివేత

ఒకరు అరెస్ట్, 220 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో అక్రమంగా విదేశీ మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సూపరిండెండెంట్ ఆర్.ప్రసాద్ తెలిపారు. ఆదివారం పిఠాపురం కాలనీలోని ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముందుగా అందిన సమాచారం మేరకు శనివారం సాయంత్రం లలితానగర్‌లోని ఒక అనుమానిత వ్యక్తిని విచారించగా మిగతా 2లో..

పడగ విప్పుతున్న డెంగీ

వార్త 5లో..

ఐక్య ఉద్యమాలతో స్టీల్‌ప్లాంట్ రక్షణ

వార్త 4లో..

ఉత్సాహంగా చదరంగం పోటీలు

వార్త 2లో..

విజేతగా నిలిచిన విశాఖ జట్టు

ముగిసిన ఆక్వాటిక్ పోటీలు

ఛాంపియన్‌గా విశాఖ, రన్నరప్‌గా ఎన్‌టిఆర్ జిల్లా

వార్త 2లో..

చైతన్యంతోనే మోసాలకు అడ్డుకట్ట

- ప్రజల ఫిర్యాదులపై విధిగా స్పందిస్తాం
- తప్పడు పద్ధతులు పాటించే వారిపై చర్యలు
- 'ప్రజాశక్తి'తో తూనికలు, కొలతలశాఖ డిప్యూటీ కంట్రోలర్ థామస్ రవికుమార్

ప్రజాశక్తి - సీతమ్మధార : వినియోగదారుల్లో చైతన్యం ఉండాలని, మోసం జరిగితే తప్పక ఫిర్యాదు చేయాలని తూనికలు, కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ థామస్ రవికుమార్ అన్నారు. మోసాల నివారణ కోసం ఏం చేయాలో తూనికలు, కొలతల శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. శాఖ ఆధ్వర్యంలో ఏయే చర్యలు తీసుకుంటున్నదీ ఆయన 'ప్రజాశక్తి'కి తెలియజేశారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

మోసాలపై ఎటువంటి ఫిర్యాదులు వస్తున్నాయి ?

చికెన్, మటన్ విక్రయాల్లో మోసాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. కొన్నిచోట్ల తూనికలు, కొలతలు శాఖ ముద్ర వేసి ఇచ్చిన పరికరాలను వినియోగించడం లేదని, డిపార్ట్‌మెంటల్ స్టోర్స్‌లో విక్రయించే కొన్నిరకాల వస్తువులపై ప్యాకేజీ నిబంధనలు ఉండటం లేదని ప్రజలు మాకు తెలియజేస్తున్నారు. మాల్స్‌లోని ర్యాక్‌లలో సరుకులు మార్చకుండా పాత ధరలకు విక్రయిస్తున్నారని, థియేటర్లలో తిను బండారాలకు అధిక ధరలు వసూలు చేస్తున్నారని, రైల్వేస్టేషన్, బస్టాండ్‌ల్లో ఆహార ఉత్పత్తులను ఎంఆర్‌పి కంటే అధికంగా వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయి. ఇటీవల రైల్వేస్టేషన్, బస్టాండ్‌ల్లో తనిఖీలు చేపట్టి దుకాణదారులకు జరిమానాలు విధించాం. మిగతా ఫిర్యాదులపైనా స్పందించి చర్యలు తీసుకున్నాం. కూరగాయల నుంచి బంగారం వరకు కొనుగోలు చేసే ప్రతి వస్తువూ బరువులో తేడా ఉన్నా, పెట్రోల్ బంకుల్లో మోసం జరిగినట్టు అనుమానమున్నా ఫిర్యాదు చేయొచ్చు.

శాఖాపరంగా ఏయే చర్యలు తీసుకుంటున్నారు ?

తూనికలు, కొలతలశాఖ రెండు రకాల కార్యకలాపాలను మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

స్పోర్ట్స్ ఎరీనాపై పర్యవేక్షణేదీ ?

బకాయి పడింది. విద్యుత్, మంచినీటి ఛార్జీలు చెల్లించడం లేదు.

ఛార్జీల వసూలు ఇలా..

ఇక్కడ వసూలు చేసే ఛార్జీలను చూస్తే కళ్లు తిరగకమానవు. బ్యాడ్మింటన్‌కు నెలకు రూ.6 వేలు, స్విమ్మింగ్ పూల్ కోసం పిల్లలకు నెలకు రూ.6 వేలు, పెద్దలకు రూ.7 వేలు, టేబుల్ టెన్నిస్‌కు నెలకు రూ.9 వేలు, యోగాకు నెలకు రూ.3 వేలు, చెస్‌కు నెలకు రూ.12 వేలు, జిమ్‌కు నెలకు రూ.3500.. ఇలా భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారు. రోజుకు గంట మాత్రమే అకాశమిస్తున్నట్టు అక్కడకు వెళ్లినవారు చెబుతున్నారు. ఫీజుల ద్వారా వస్తున్న సొమ్మును ఎస్క్రో అకౌంట్‌లో వేయాలి. ఈ అకౌంట్‌ను కాంట్రాక్టర్, జివిఎంసి యొక్క స్మార్ట్ సిటీ కార్పొరేషన్ జాయింట్‌గా నిర్వహించాలి. కానీ ఇప్పటికీ అకౌంట్ తెరవనట్టు సమాచారం. ఫీజుల సొమ్మంతా కాంట్రాక్టర్ సొంత అకౌంట్‌లో వేసుకుంటున్నట్టు విమర్శలున్నాయి. ఫీజుల ద్వారా వచ్చే సొమ్ములో మొదటగా జివిఎంసికి అద్దె, విద్యుత్, వాటర్ ఛార్జీలు చెల్లించాలి. కానీ చెల్లించడం లేదు. ప్రతి రోజూ ఎంతమంది వినియోగించుకుంటున్నారు ? నెలకు ఎంత ఆదాయం వస్తుంది ? అన్న విషయాన్ని జివిఎంసి పర్యవేక్షించడం లేదు. దీంతో ఫీజుల ద్వారా వచ్చే కోట్ల రూపాయల ఆదాయాన్ని కాంట్రాక్టరు కాజేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవంగా లాభంలో జివిఎంసికి 40 శాతం వాటా కూడా కాంట్రాక్టర్ ఇవ్వాలి. దీనిని గాలికొదిలేశారు. నిబంధనల ప్రకారం జివిఎంసి స్కూల్ పిల్లలకు ఉచితంగా ప్రవేశం కల్పించాలి. కానీ అలా జరగడం లేదని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణం కాంట్రాక్టర్ నుండి లీజు బకాయిని వసూలు చేయాలని, అతనిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, స్పోర్ట్స్ ఎరీనాను జివిఎంసి స్వాధీనం చేసుకుని పేద, సామాన్య ప్రజలందరికీ ప్రవేశం కల్పించాలని సిపిఎం ఫ్లోర్ లీడర్, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేస్తున్నారు.

చైతన్యంతోనే మోసాలకు అడ్డుకట్ట

నిర్వహిస్తోంది. మొదటిది ప్రమాణాలను సరిచేయడం కోసం వ్యాపారం చేసే వారి తూనికలు, కొలతల సామగ్రిని తనిఖీ చేస్తుంటాం. రెండోది ఎన్‌ఫోర్స్‌మెంట్ నిబంధనలను పాటిస్తున్నారా? లేదా? తనిఖీ చేసి, మోసం చేసేవారిపై చర్యలు తీసుకుంటాం. చిన్నపాటి కూరగాయల దుకాణం నుంచి పరిశ్రమల వరకు తూనికలు, కొలతల కార్యకలాపాలను పర్యవేక్షిస్తాం. యజమానులు తప్పనిసరిగా రెండేళ్లకు ఒకసారి నిబంధనలకు అనుగుణంగా కాటాలు, మెషిన్లు తనిఖీ చేయించుకుని ధ్రువపత్రం తీసుకోవాలి. ధ్రువపత్రం లేని కాటాలు, మెషిన్లను వినియోగిస్తే ఎవరైనా ఫిర్యాదు చేయొచ్చు.

ఎలా ఫిర్యాదు చేయాలి ?

ఫిర్యాదుల కోసం రాష్ట్ర స్థాయిలో టోల్ ఫ్రీ నంబరు 1967 ఉంది. స్థానికంగా 0891 2799551 నెంబర్ అందుబాటులో ఉంది. ఆన్‌లైన్‌లో పిజిఆర్ఎస్‌కు ఫిర్యాదు చేయొచ్చు. ఫిర్యాదు అందిన కొన్ని గంటల్లోనే చర్యలు తీసుకుని అప్‌డేట్ సమాచారాన్ని అందిస్తాం. ప్రతి ఫిర్యాదుపైనా చర్యలుంటాయి. ఫిర్యాదు చేసే వ్యక్తి సమాచారాన్ని గోప్యంగా ఉంచుతాం. ప్రతి ఒక్కరూ ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి. ఎవరూ ప్రశ్నించకపోతే మోసాలు పెరుగుతాయి. ఫిర్యాదుపై స్పందించి చర్యలు తీసుకుంటే మిగిలిన వారికి భయం కలుగుతుంది.

ప్యాకేజీ నిబంధనలు గురించి చెబుతారా ?

ప్యాకేజీ నిబంధనలపై వినియోగదారులకు అవగాహన ఉండాలి. ప్రతి ప్యాకింగ్ వస్తువుపైనా తప్పనిసరిగా కొన్ని వివరాలు ఉండాలి. అవి లేకపోయినా, తప్పుడు సమాచారం ఉన్నా ఫిర్యాదు చేయొచ్చు. వస్తువు తయారుచేసిన సంస్థ, ప్యాకెట్‌లో ఉన్న ఐటెమ్, బరువు, గడువు, ధర వంటి వివరాలు ఉండాలి. ఇందులో ఏ సమాచారం లేకపోయినా, అదనపు ధర వసూలు చేసినా శిక్షార్హులు. కొత్తగా యూనిట్ సేల్ ధరను కూడా ఉంచాలని నిబంధన వచ్చింది. అంటే ఒక గ్రాము ధర ఎంత పడుతుందన్న సమాచారం తప్పనిసరిగా ముద్రించాలి.

కేసుల నమోదు ఎలా ఉంది ?

గత సంవత్సరం ఉమ్మడి విశాఖ జిల్లాలో 2,519 మందిపై కేసులు నమోదు చేశాం. అందులో తూనికలకు సంబంధించిన మోసాలు 1422 ఉన్నాయి. ప్యాకేజీ నిబంధనలు అమలు చేయనివారిపై 1097 కేసులు ఉన్నాయి. శాఖ పరిధిలో సిబ్బంది కొరత ఉంది. ఉన్న వారితోనే పర్యవేక్షణ చేపడుతున్నాం. ప్రస్తుతం డిప్యూటీ కంట్రోలర్, విశాఖ జిల్లాలో నలుగురు అసిస్టెంట్ కంట్రోలర్స్ ఉన్నారు. వీరిలో ఇద్దరు పూర్తిగా హెచ్‌పిసిఎల్, ఐఒసి, బిపిసి కంపెనీలోని ట్యాంకులను పరిశీలిస్తారు. మిగిలిన ఇద్దరూ నగర పరిధిలో సేవలందిస్తారు. అనకాపల్లి జిల్లాకు అసిస్టెంట్ కంట్రోలర్, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. వీరిలో నర్సీపట్నం కేంద్రంగా పనిచేసే ఇన్‌స్పెక్టర్ అల్లూరి జిల్లా బాధ్యతలను కూడా చూస్తారు. అల్లూరి జిల్లాకు ఒక అసిస్టెంట్ కంట్రోలర్ ఉన్నారు.

భారీగా విదేశీ మద్యం పట్టివేత

స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

అతడి వద్ద నాలుగు బాటిళ్లు విదేశీ మద్యం లభించిందని అతడు తమిళనాడుకు చెందిన తిరుపతి వెంకటేశ రామయ్యపిళ్ళైగా గుర్తించామని అన్నారు. అతడు లలితానగర్‌లోని ఒక ఇంటిని కాస్మెటిక్స్ వ్యాపారం చేస్తానని అద్దెకు తీసుకుని ఆ ఇంటిలో విదేశీ మద్యం డంప్ చేసి విక్రయిస్తున్నట్టు గుర్తించామన్నారు. అతడి ఇంటిలో సోదాలు నిర్వహించగా 34 విదేశీ బ్రాండ్లకు చెందిన 220 మద్యం బాటిళ్లు లభించాయని వీటి మార్కెట్‌ధర సుమారుగా రూ.15-18 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. అంతేకాకుండా ఈ మద్యం అసలైనదా లేదా ఏదైనా కల్తీ జరిగిందా అనే విషయంపై నిర్ధారణకు వచ్చేందుకు ఇప్పటికే కొన్ని శాంపిళ్లను ల్యాబ్‌కు పంపించామని ఆయన తెలిపారు. అతని వద్ద నుండి ఒక ద్విచక్ర వాహనం, రూ.4300 నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని ముద్దాయిపై గతంలో నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో పాత కేసులు ఉన్నాయని ఆయన తెలిపారు.

ముగిసిన ఆక్వాటిక్ పోటీలు

ఛాంపియన్‌గా విశాఖ, రన్నరప్‌గా ఎన్‌టిఆర్ జిల్లా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ బీచ్ రోడ్డులోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన పదో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలుర, బాలికల ఆక్వాటిక్ స్విమ్మింగ్ టోర్నీలో విశాఖపట్నం జిల్లా ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. ఎన్‌టిఆర్ జిల్లా రన్నరప్‌గా నిలిచింది. రెండు రోజులపాటు జరిగిన ఈ టోర్నమెంట్‌లో అద్భుతంగా రాణించిన విశాఖ స్విమ్మర్లు 15 స్వర్ణ, 27 రజిత, 23 కాంస్య పతకాలతో 179 పాయింట్లు సాధించి ఓవరాల్ ఛాంపియన్ ట్రోఫీని సొంతం చేసుకున్నారు. విశాఖతో పోటాపోటీగా రాణించిన ఎన్‌టిఆర్ జిల్లా స్విమ్మర్లు 22 స్వర్ణ, 12 రజిత, 9 కాంస్య పతకాలతో 155 పాయింట్లు సాధించి రన్నరప్ ట్రోఫీని గెలుచుకున్నారు. కృష్ణా జిల్లా తొమ్మిది స్వర్ణ, 10 రజిత, 15 కాంస్య పతకాలతో 90 పాయింట్లు సాధించి తృతీయ స్థానాన్ని దక్కించుకుంది. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మోహన్ వెంకట్రావు, విశాఖ జిల్లా కార్యదర్శి సంతోష్ శెట్టి, ఇతర ప్రతినిధులు ఎన్.విజయకుమార్ ఆర్.విజయ్ కుమార్ విజేతలకు ట్రోఫీలు, పతకాలు అందజేశారు.

వ్యక్తిగత విజేతలు వీరే..

గ్రూప్-3 బాలుర విభాగంలో బలంగా స్వామి నాయుడు (ఏలూరు), బాలికల విభాగంలో యామర్తి పార్ధవి (కృష్ణ), గ్రూప్ - 2 బాలుర విభాగంలో బి.పృథ్వీరాజ్ (ఎన్‌టిఆర్), బాలికల విభాగంలో యానా జైన్ (ఎన్‌టిఆర్) వ్యక్తిగత ఛాంపియన్లుగా నిలిచి పతకాలను అందుకున్నారు. అదేవిధంగా గ్రూప్-1 బాలుర విభాగంలో జక్క గణేష్ (విశాఖపట్నం), పి.అవినాష్ (శ్రీకాకుళం), సుగాలి కార్తికేయ (అనంతపురం), బాలికల విభాగంలో ఎన్.పావని సరయు (ఎన్‌టిఆర్) వ్యక్తిగత ఛాంపియన్ అవార్డులు అందుకున్నారు.

33వ వార్డులో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం 33వ వార్డు హరిజన వీధిలో పారిశుధ్యం పూర్తిగా లోపించిందని, ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణ దారుణంగా ఉందని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు ఆరోపించారు. హరిజన వీధి డోర్ నెంబర్ 31-13-35 ఇంటిని అనుకుని ఉన్న కాలువలో నిత్యం మురుగనీరు నిల్వఉండిపోతోందని కాలువ నుంచి మురుగనీరు రోడ్లపై ప్రవహిస్తూ, దుర్వాసన వస్తోందన్నారు. దీనిపై ఫిర్యాదు చేస్తే తాత్కాలికంగా చర్యలు తీసుకుంటున్నారని, కాలువను పూర్తి స్థాయిలో మరమ్మత్తు చేసి శాశ్వత పరిష్కారం చూడాలన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎస్సి, ఎస్టి, సబ్ ప్లాన్ నిధులను దళితవాడల అభివృద్ధికి ఖర్చు చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు విస్మరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా 33 వ వార్డు దళితపేట సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పెరిగిన ఎర్నిమాంబ ఆలయ ఆదాయం

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ : జ్ఞానాపురంలో ప్రసిద్ధి చెందిన ఎర్నిమాంబ ఆలయ ఆదాయం బాగా పెరిగిందని దేవస్థానం కార్యనిర్వహణ అధికారి డి.వి.ఎస్ సురేష్‌బాబా మీడియాకు తెలిపారు.

ఆలయ ఇఒగా తాను బాధ్యతలు చేపట్టే నాటికి ఆలయ వార్షిక ఆదాయం రూ.81 లక్షల 46 వేల 487 ఉండగా నేడు అది రూ.2 కోట్ల 62 లక్షల 74,536కు పెరిగిందని తెలిపారు. జ్ఞానాపురం, అచ్చియ్యమ్మ పేట గ్రామస్తుల సహకారంతో ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు ఆదినారాయణ, నారాయణ, శ్యామ్‌సుందర్‌రెడ్డి, అచ్చియ్యమ్మపేట గ్రామ అధ్యక్షుడు సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు మహిళలకు ఆశ్రయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలో వివిధ ప్రదేశాల్లో రోడ్లపై తిరుగుతూ, కనిపించిన ఐదుగురు వృద్ధ మహిళలను, వేరు వేరు ప్రదేశాలలో, వేరు వేరు తేదీల్లో పోలీసుల సమాచారంతో రెస్క్యూ చేసి ఎయుటిడి మహిళా షెల్టర్ లో ఇటీవల ఆశ్రయం కల్పించటం జరిగిందని ఎయుటిడి కార్యదర్శి ప్రగడ వాసు మీడియాకు తెలిపారు. కుటుంబ సభ్యుల నిరాదరణకు గురై రోడ్డు పాలైన వీరిని జ్ఞానాపురం మదర్ థెరిసా హోంలో చేర్పించారు.

వీరిలో కంచరపాలెం కు చెందిన ఆమె దమయంతి (83), ఆరిలోవకు చెందిన లక్ష్మి (75) జాలరి పేట బీచ్ రోడ్డుకు చెందిన రాములమ్మ (80)తో పాటు, పేరు తప్ప ఏమీ చెప్పలేని రుక్మిణి (35), దివ్యాంగురాలు శాంతమ్మ (58) ఉన్నారని తెలిపారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు

విసిసి ఆధ్వర్యాన జరిగిన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మహారాణిపేటలోని సెయింట్ ఆంథోనీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ప్రపంచ చదరంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా స్థాయి చదరంగం పోటీలు నిర్వహించారు. ఇంటరాక్ట్ క్లబ్ ఆఫ్ వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్, రోటరీ క్లబ్ విశాఖపట్నం సహకారంతో ఈ పోటీలు చేపట్టారు. విసిసి కన్వీనర్ కె.సుశీల మాట్లాడుతూ ఇంటర్నేషనల్ చెస్ డే సందర్భంగా ప్రతి సంవత్సరం చెస్ పోటీలను వివిధ స్థాయిల్లో నిర్వహిస్తున్నామన్నారు. బాలలలో భయాన్ని పోగొట్టడం కోసం, లాజికల్ థింకింగ్ పెంపొందించడం కోసం ఈ పోటీలు దోహదపడతాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఈ సంవత్సరం దీనిపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు .సహకరించిన విశాఖపట్నం రోటరీ క్లబ్ వారికి ధన్యవాదాలు తెలిపారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ కేటగిరీల్లో ఆదివారం ఈ పోటీలు చేపట్టామన్నారు. త్రీ రౌండ్స్ తరువాత ఫోర్త్ రౌండులో విన్నర్స్‌ని తీశామన్నారు. విజేతలకు బహుమతులను రొటె మీరియన్ మొదాంబికా (డిస్ట్రిక్ట్ యూత్ ప్రొటెక్షన్ చైర్) చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోటరీ సహకారంతో 132 ఇంటరాక్ట్ క్లబ్స్ ఏర్పాటు చేశామన్నారు. వాటి ద్వారా నాయకత్వ అభివృద్ధి, చదువుకు సంబంధించిన అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనికి వాలంటీర్లుగా గౌతమ్, ప్రీతి, కల్యాణి, మణి, ఎల్లాజీ వ్యవహరించారు. జడ్జీలుగా లక్ష్మణ్, మాధవరావు, బుజ్జి వ్యవహరించారు. భార్గవి, ట్యూషన్స్ సెంటర్ కో-ఆర్డినేటర్ సతీష్ పాల్గొన్నారు.

గాజువాక : చదరంగం క్రీడ దినోత్సవం సందర్భంగా ఛాంపియన్స్ అకాడమీ కోచ్ పట్నాల శివ ఆధ్వర్యాన వికాస్‌నగర్‌లో ఆదివారం చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను అంతర్జాతీయ క్రీడాకారిణి, హైకోర్టు న్యాయవాది అండిబోయిన లక్ష్మి, వార్డు కార్పొరేటర్ కేబుల్ మూర్తి, ఎపి పవర్ లిఫ్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అండిబోయిన అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చదరంగంలో విజ్ఞాన పరిజ్ఞానం ఉండాలన్నారు. ఈ క్రీడల వల్ల పిల్లల్లో పోటీతత్వం పెరిగి చైతన్యవంతంగా ఎదుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో అండిబోయిన శ్రీను, బత్తిన రాము, పట్నాల నాగేశ్వరరావు, క్రీడాకారుల తల్లిదండ్రులు, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
E.P. 231/2022 in O.S.927/2013
Between:
Doddi Umavathi **...D.Hr/Plaintiff**
And
Gandepalli Venkata Naga Raju & another **...J.Drs/Defenants**
To
JDR-1 Gaudepalli Venkata Naga Raju, Rly Employee, D. No.7-14-8, 1st Floor, So. late Venkata Ramana, Al Out Gate down, China Waltair, Visakhapatnam.
JDR-2 Gandepalli Appalanarasamma, W/o.late Venkata Ramana, House Wife D.No.7-14-8, 1st Floor, AU Out Gate down, China Waltair, Visakhapatnam.
SALE NOTICE
Please take notice that above named D. Hr/Plaintiff has instituted the above case against both of you and the matter stands posted to 01-08-2025 for NOTICE to you. Therefore, you are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **01-08-2025 at 10:30 A.M** for your objection for the above Sale Notice, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.
SCHEDULE PROPERTY
Immovable property at Visaskha patnam Dist, GVMC limits, RCC Building bearing in 200 Sq. Yds. at Chinawaltair bearing D.No.7-14-8, bounded by
East : Vacant site of Andhra University.
West : RCC Building of Y. Vasu.
South : R.C.C. Building of B.Pydayya.
North : Road.
The schedule property was got attached in I.A 585/13 before Judgment and made absolute on 16-7-2014.
P. RAMA KRISHNA
Advocate for D.Hr.
Visakhapatnam.

కెజిబివిలో అదనపు సౌకర్యాలు

- **అదనంగా ఏడు డార్మిటరీలతో పాటు ప్రహరీ, రోడ్డు నిర్మాణం**

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధి గొల్లలపాలెంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యా లయంలో అదనపు సౌకర్యాలు సమకూరాయి. ఈ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు ఒక్కో తరగతికి 40 మంది చొప్పున 200 మంది బాలికలు చదువుతున్నారు. జూనియర్ కళాశాల కూడా ఉంది. ఇంటర్ మొదటి ఏడాది, రెండో ఏడాది చెరో 40 మంది బాలికలు చదువుతున్నారు. బైపిసి గ్రూప్ మాత్రమే ఇక్కడ ఉంది. మొత్తంగా 280 మంది బాలికలు చదువుతున్నారు.

అదనపు సౌకర్యాలు ఏర్పాటు..

అదనంగా నిర్మించిన డార్మిటరీలు

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఈ కెజిబివిని గతేడాది ఆగస్టు 31న సందర్శించారు. ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, బాలికలు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, సభ్యులతో ఇష్టా గోష్టిగా మాట్లాడారు. పాఠశాలలో సమస్యలనడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. మంత్రి ఆదేశించడమే తరువాయి పాఠశాలలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగాయి. రూ.కోటీ 40 లక్షలతో ఏడు డార్మిటరీలు (అదనపు గదులు) నిర్మించారు. ఒక్కో గదిలో 40 మంది ఉండేలా నిర్మించారు. గత వైసిపి ప్రభుత్వంలో నాడు, నేడు పథకం కింద ప్రారంభించి అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న 4 డార్మిటరీలు, ఇప్పుడు అదనంగా మరో 3 డార్మిటరీలు, 20 బాత్ రూమ్‌ల నిర్మాణం చేపట్టి పూర్తిచేశారు. ప్రస్తుతం వినియోగంలో ఉన్నాయి.

అదనంగా నిర్మించిన బాత్ రూమ్‌లు

ప్రహరీ, రోడ్డు నిర్మాణం..

పట్టణానికి శివారున గొల్లలపాలెంలో 2018లో సొంత భవనంలోకి మారిన కెజిబివి ఇప్పుడు పూర్తి స్థాయి సౌకర్యాలతో రూపు రేఖలు దిద్దుకుంది. బాలికలకు ఇక్కడే చదువు, వసతి ఉండడం, కొండ ప్రాంతం కావడంతో బాలికల భద్రతపై ఉపాధ్యాయుల్లోనే గాకుండా బాలికల్లో కూడా ఒకింత ఆందోళన ఉండేది. ప్రహరీ నిర్మించాలన్న డిమాండ్ ఎట్టకేలకు నెరవేరింది. అలానే ప్రధాన రహదారికి అనుకుని కెజిబివికి వెళ్లే రోడ్డు ఏళ్ల తరబడి గతుకుల మయంగా ఉండేది. అటుగా రాక పోకలు ఇబ్బందిగా ఉండేవి. ఇప్పుడు రోడ్డు నిర్మాణం చేపట్టారు.

అదనపు సౌకర్యాలతో రూపు రేఖలు మారిన కెజిబివి

సౌకర్యాల కల్పనపై హర్షం

అదనంగా ఏడు డార్మిటరీలు, బాత్ రూమ్‌లు, ప్రహరీ, రోడ్డు నిర్మాణం పూర్తి చేయడం ఆనందంగా ఉంది. ఇందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు. సౌకర్యాలతో పాటు సరిపడా ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఉన్నారు. గతంలో స్కూల్, కళాశాలకు కేవలం 6 తరగతి గదులు, బాలికలు నిద్ర పోయేందుకు 5 గదులు ఉండేవి. ఇప్పుడు గదులు పెరిగాయి. 6 నుంచి 10 వ తరగతి వరకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం, సైన్స్, ఫిజిక్స్, ఎన్ఎస్, పిఇటి ఉన్నారు. సైన్స్ ల్యాబ్, గ్రంథాలయం ఉంది. జువాలజీ, బోటనీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ బోధించే అధ్యాపకులు ఉన్నారు.

గంగా కుమారి
ప్రిన్సిపల్

నేరాలు ఘోరాలు

లంకెలపాలెం జంక్షన్‌లో మరో ప్రమాదం

- లారీ ఢీకొని మహిళ దుర్మరణం

ప్రజాశక్తి - పరవాడ: జివిఎంసి 79వ వార్డు లంకెలపాలెం జంక్షన్‌లో రోడ్డు ప్రమాద మరణాలు కొనసాగుతున్నాయి. ఆదివారంరంగనాయకనగర్ కాలనీకి చెందిన దాసరి ఆదిలక్ష్మి (60) అనే మహిళ రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని అతివేగంగా వచ్చిన లారీ ఢీకొనడం వల్లే మృత్యువాత పడిందని ప్రత్యక్షసాక్షులు అంటున్నారు అందిన సమాచారం మేరకు పరవాడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్‌కు తరలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లంకెలపాలెం జంక్షన్‌లో ఇటీవలి వరుసగా రోడ్డు ప్రమాదాలు, పలువురి ప్రాణాలు పోతుండడంపై స్థానికంగా భయాందోళనలు వ్యక్తమౌతుందన్నారు. వేగనియంత్రణతోపాటు ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-మధురవాడ : మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు పిఎం.పాలెం పోలీసు స్టేషన్ సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. సిఐ కథనం ప్రకారం... జివిఎంసి 6వ వార్డు పరిధి పిఎం.పాలెం, ఆర్‌హెచ్.కాలనీకి చెందిన కోర్లపు లక్ష్మణరావు (40) కొంత కాలం నుంచి కుటుంబ సభ్యులకు దూరంగా నివాసముంటున్నాడు. లక్ష్మణరావు మద్యానికి బానిసై ఏ పని చేయకపోవడంతో భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదాల కారణంగా విడివిడిగా నివసిస్తున్నారు. ఆదివారం లక్ష్మణరావు ఆర్‌హెచ్.కాలనీలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మచేసుకున్నట్లు తెలుసుకున్న భార్య జయలక్ష్మి వెంటనే అక్కడికి వెళ్లారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుని భార్య జయలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు.

గంజాయితో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరిని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 34 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు ఆనందపురం సిఐ వాసునాయుడు, ఎస్ఐ శివ సిబ్బందితో కలిసి సత్తారు జంక్షన్ సర్వీస్ రోడ్డులో తనిఖీలు చేపట్టారు. అక్కడ మూడు పెద్ద బ్యాగులతో నిలబడి ఉన్న ఇద్దరు పోలీసులను చూసి పారిపోవడానికి యత్నించగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి బ్యాగుల్లో 34 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. అరెస్ట్ అయిన వారిలో పార్వతీపురం మన్యం జిల్లా, పార్వతీపురం మండలం, రామునాయుడు గ్రామానికి చెందిన మురిపి గోవిందరావు అలియాస్ గౌతమ్ (36), ఒడిశా రాష్ట్రం, మల్కనగిరి జిల్లా, బలిమీల గ్రామానికి చెందిన బాలుడు ఉన్నారు.

హోమియో మందుల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి తొలుత ఈ శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు టి జగన్నాథరావు, టిజె.మోహన్ రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్ఎన్.మూర్తి, కె.చంద్రశేఖర్, కెవి.భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి -తగరపువలస : ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యాన చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో ఎన్ఎంఎంఎస్‌లో ఉచితంగా శిక్షణ పొందుతున్న విద్యార్థులకు సుమారు రూ.30 వేలు విలువైన స్టడీ మెటీరియల్‌ను పూర్వ ప్రధానోపాధ్యాయులు, సంఘ సేవకులు పొట్నూరు మురళీమోహనరావు చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉచిత శిక్షణా తరగతులను వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఇప్పటి నుంచే పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, ఉపాధ్యాయులు అప్పారావు, వైవి.రమణ, దుష్యంత్, శివకుమార్, ఎల్ఎ.శ్రీనివాస్, దత్త రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు నూతన కమిటీ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఆనందపురం : ఆనందపురం శ్రీ వెంకటరంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన కమిటీ సభ్యులు సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. నూతన కమిటీలో జగన్నాథపురం గ్రామానికి చెందిన పాండ్రంగి అప్పలరాజు చైర్మన్‌గా డైరెక్టర్లుగా ఆనందపురానికి చెందిన మీసాల రామునాయుడు, చీమలమెట్టపాలెం గ్రామానికి చెందిన ఎర్ర బంగారునాయుడు (బన్నీ) బాధ్యతలు స్వీకరించనున్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

వైసిపి భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త చిన్న శ్రీను



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి -తగరపువలస : కూటమి ప్రభుత్వ వైఫల్యాలను క్షేత్ర స్థాయిలో ఎండగట్టాలని వైసిపి భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పార్టీ మండల స్థాయి నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. భీమిలి మండలం మజ్జివలస గ్రామంలో పార్టీ సీనియర్ నాయకులు పెదబాబు నివాసంలో ఆదివారం పార్టీ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం తీవ్ర వైఫల్యం చెందిందని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలు అటకెక్కాయన్నారు. పాలక పక్షం తప్పులను ఎత్తిచూపి ప్రజల గొంతుకగా నిలవడం ప్రధాన ప్రతిపక్ష పార్టీగా మన బాధ్యత అని పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. సమిష్టిగా నిర్ణయాలను తీసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. మత్స్యకార భరోసా, తల్లికి వందనం పథకాల అమలులో చిత్త శుద్ధి లేదని, కుంటి సాకులు చూపి ఎంతో మంది అర్హులకు అందకుండా చేశారని విమర్శించారు. ఉన్న పింఛన్లలో అనర్హత పేరుతో కోత విధించారని, కొత్త పింఛన్ల ఊసే లేదని చెప్పారు. అన్నదాత సుఖీభవ ఇప్పటికీ అమలు చేయలేదని, ఖరీఫ్‌లో ఎరువులు, విత్తనాలు ఇంకా రైతులకు అందలేదని ధ్వజమెత్తారు. పార్టీని సంస్థా గతంగా మరింత బలోపేతం చేసేందుకు సమన్వయంతో పనిచేద్దామని పిలుపునిచ్చారు. "బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ" నినాదంతో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షులు గాడు శ్రీను అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపిపి డివిఎస్ఎస్ఎన్.రాజు, వైస్ ఎంపిపి బోని బంగారునాయుడు, ఎఎంసి మాజీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, నాయకులు సరగడ రఘునాథరెడ్డి, బి.దుర్గారావు, దుంపల ప్రభాకరరావు, కెపి.సత్యనారాయణ, మద్దిల వెంకటరమణ, అక్కరమాని అప్పలనాయుడు, పొట్నూరు చంద్రశేఖర్, పలు పంచాయతీల వైసిపి సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి తద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని గ్రీన్ క్లైమేట్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం కోరారు. జివిఎంసి మూడో వార్డు పరిధి గొల్లలపాలెం కెజిబివి ప్రాంగణంలో విశాఖ పోర్టు ట్రస్ట్ అందజేసిన పండ్ల జాతికి చెందిన మొక్కలను ఆదివారం నాటారు. నీడనిచ్చే మొక్కలు 50, ఫలాలు ఇచ్చేవి 100 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి విద్యా సంస్థను ఓ తోటగా తీర్చిదిద్దాలని కోరారు. ప్రిన్సిపల్ గంగాకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న విద్యార్థినులు

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి -పద్మనాభం : సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరమని రాష్ట్ర సమాచార యాక్టివిస్ట్ అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షులు తిరుపతిరావు తెలిపారు. పద్మనాభంలోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం ద్వారా పలు సమస్యను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అనేక కార్యక్రమాలు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. పద్మనాభం, జామి, చోడవరం, కె.కోటపాడు, వేపాడ తదితర మండలాల్లో పలు సమస్యలపై 500 దరఖాస్తులు చేశామని, ఇందులో సుమారు 350 పరిష్కారమయ్యాయని తెలిపారు. ఏదైనా సమస్యపై ఫిర్యాదు చేస్తే 30 రోజుల్లో పరిష్కారం అవుతుందని చెప్పారు. ఈ నెల 26వ తేదీన విశాఖపట్నంలోని చాణుక్య డిగ్రీ కళాశాలలో రాష్ట్రస్థాయి అధికారులు, నాయకులతో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మండల, గ్రామస్థాయిలో కూడా కమిటీలు ఏర్పాటుచేసి అవగాహన కల్పించేందుకు కృషిచేస్తామని చెప్పారు.

కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి -మధురవాడ : శిల్పారామంలో జాతరలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం శ్యామల డాన్స్ అకాడమీకు చెందిన చిన్నారులు కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలిచ్చారు. మహాగణపతి, చంద్రచూడ, కొలువైతివా, జయం జయం, కొండలలో నెలకొన్న, గరుడగమన, ముద్దుగారే యశోద గేయాలకు ప్రశాంతి, చాందిని, హారిక, రక్షిత, తులసి, దేవీప్రసన్న, హరిణి, అమృత నృత్య ప్రదర్శనలిచ్చారు. కార్యక్రమాన్ని పరిపాలనాధికారి రమేష్‌రెడ్డి పర్యవేక్షించారు.

జ్యోతిని అభినందిస్తున్న పలువురు టిడిపి నాయకులు

అవగడ్డ జ్యోతికి అభినందనలు

ప్రజాశక్తి-పెందుర్తి : మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన డాక్టర్ అవగడ్డ జ్యోతికి పలువురు నాయకులు, కార్యకర్తలు ఆదివారం అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పార్టీ ఆవిర్భావం నుంచి తన కుటుంబ సభ్యులు టిడిపిలో పనిచేస్తున్నారని, వారి సేవలను గుర్తించి తనకు పదవి ఇవ్వడంతో పార్టీ పట్ల మరింత బాధ్యత పెంచిందని పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు, ఐటి శాఖ మంత్రి లోకేష్, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జి, స్థానిక ఎమ్మెల్యే పంచకర్లకు ధన్యవాదాలు తెలిపారు.

మాట్లాడుతున్న వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు కెకె.రాజు

అమలుకాని హామీలతో మోసం

ప్రజాశక్తి-సీతమ్మధార : అమలుకాని అబద్ధపు హామీలిచ్చి ప్రజలను మోసం చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబును మించిన నాయకుడు దేశంలో లేడని వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు ఆరోపించారు. జివిఎంసి 24వ వార్డులో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన ఏడాది కాలంలో ఎన్నికల ముందు ఇచ్చిన ఏ హామీనీ అమలుచేయలేదన్నారు. చంద్రబాబు చేసే మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భవనం ప్రారంభం

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డులో సామాజిక భవనాన్ని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక ప్రజల సమస్య మేరకు ఈ సామాజిక భవనం నిర్మించినట్లు తెలిపారు. దీనిని అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలకు అభివృద్ధితోపాటు సంక్షేమం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శివప్రసాదరావు, జనసేన ఉత్తర నియోజకవర్గ ఇన్‌ఛార్జి పసుపులేటి ఉషాకిరణ్, వార్డు కార్పొరేటర్ ముక్క శ్రావణి, ముక్క కిషోర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గంగాధర్, డిఇ విజయకుమార్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పంపిణీ

ప్రజాశక్తి- ములగాడ : జివిఎంసి 58వ వార్డు పరిధి శ్రీహరిపురం రామ్‌నగర్‌కు చెందిన యరబాల వసంత ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి సహాయనిధి రూ.90 వేల చెక్కును ప్రభుత్వ విప్ గణబాబు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, తెలుగుదేశం ప్రభుత్వం పేద ప్రజలకు అండగా నిలుస్తుందన్నారు. ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు పెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దుర్గా ప్రశాంతి, మాజీ కార్పొరేటర్ ఉమామహేశ్వరి, వార్డు టిడిపి అధ్యక్షులు కోరాడ శ్రీనివాసరావు, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ పోతాబత్తుల శ్రీనివాస్, నాయకులు గోనప వెంకటరమణ, గొండేసి రాజేష్‌రెడ్డి, నాగమణి, నాగలక్ష్మి, సుందరరావు, సూరి, రాము తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందిస్తున్న గణబాబు

ఐక్య ఉద్యమాలతో స్టీల్‌ప్లాంట్ రక్షణ

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఐక్య ఉద్యమాల ద్వారా స్టీల్‌ప్లాంట్‌ను రక్షించగలమని సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు పేర్కొన్నారు. సిఐటియు స్టీల్ జోన్ 3వ మహాసభ ఉక్కునగరంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కెఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ, కార్మికులు పోరాడి సాధించిన విజయాలు చాలా ఉన్నాయన్నారు. 2021 నుండి నేటి వరకు స్టీల్‌ప్లాంట్ ఒక్క శాతం కూడా ప్రైవేటీకరణ జరగకుండా పోరాటాలతో అడ్డుకున్నామని చెప్పారు. స్టీల్ జోన్‌లో అసంఘటిత కార్మికులైన మున్సిపల్ కార్మికులు పోరాటాలు చేసి హక్కులు సాధించుకోవడాన్ని గుర్తుచేశారు. ఇటీవల కాలంలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు తమ హక్కుల సాధన కోసం సిఐటియు నాయకత్వంలో బలమైన పోరాటాలు చేయడాన్ని గుర్తుంచుకోవాలన్నారు. స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రూ.11,440కోట్లు ఇచ్చామని చెబుతున్నారు తప్ప స్టీల్ కార్మికులకు ఏమాత్రం ప్రయోజనం లేదని తెలిపారు.

ప్యాకేజీని సాకుగా చూపిస్తూ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులను నిర్దాక్షిణ్యంగా తొలగించారని తెలిపారు. పర్మినెంట్ కార్మికులను విఆర్ఎస్ పేరుతో తొలగిస్తూ స్టీల్‌ప్లాంట్‌ను అదాని, అంబానీలకు కట్టబెట్టడానికి కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందన్నారు. దీనికి వ్యతిరేకంగా స్టీల్ ప్లాంట్ రక్షణకై ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు.

సిఐటియు స్టీల్‌జోన్ నాయకులు ఆడారి విశ్వనాథం మాట్లాడుతూ, 1923 సంవత్సరం నుంచి ఉన్న కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం 4 లేబర్ కోడ్లుగా మార్చేసి కార్మికులను బానిసలుగా చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఉన్న అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయలేదని, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఉన్నా అమలు కావడం లేదని తెలిపారు. కార్మికులు, కర్షకులు పెద్ద ఎత్తున సంఘటితమై రాజకీయాల్లో మార్పులు తీసుకొస్తే కార్మిక రాజ్యం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నమ్మి రమణ, ఎ.నారాయణమూర్తి, వి.వి.రమణ, అప్పారావు, వెంకయ్య, గణేష్, డి.రమణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన కమిటీతో సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు

నూతన కమిటీ ఎన్నిక

సిఐటియు స్టీల్ జోన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వి.వి.రమణ, ప్రధాన కార్యదర్శిగా డి.వెంకటరావు, కోశాధికారిగా ఎన్.దత్తాత్రేయరాజు, కార్యదర్శి వర్గ సభ్యులుగా ఆడారి విశ్వనాథం, ఒ.అప్పలనాయుడు, గణేష్, నమ్మి రమణ, సరోజిని, నాగరాజు, పి.వెంకయ్య, గోపాల్ ఎన్నికయ్యారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ పీలా, ఎమ్మెల్యే పల్లా

ప్రజాశక్తి- యంత్రాంగం

పెందుర్తి : మండలంలోని రాంపురం గ్రామంలో రూ.2.25 కోట్లతో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలు ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ, పంచాయతీ పరిధిలో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో నిర్మించిన రోడ్లు, డ్రెయిన్లు, జలజీవన్ మిషన్ ద్వారా నిర్మించబోతున్న వాటర్ ట్యాంక్‌కు శంకుస్థాపన, అంగన్వాడీ భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. అభివృద్ధి విషయంలో తనకు పార్టీలు, ప్రాంతాలు అనే భేదం లేదన్నారు. ఎన్నికలు జరిగేటప్పుడు మాత్రమే రాజకీయాలు, విమర్శలు, ప్రతి విమర్శలు తప్ప గెలిచిన తర్వాత ఐదేళ్ల కాలంలో ఎంత అభివృద్ధి చేశామన్నదే ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అప్పలరాజు, పంచాయతీరాజ్ అధికారులు పి.వి.రమణమూర్తి, లక్ష్మణరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సత్యనారాయణ, ఎంపిపి మదపాడ నాగమణి, జెడ్‌పిటిసి సభ్యులు ఇప్పిలి దేవి, ఎంపిటిసి సభ్యులు గండి హిమబిందు పాల్గొన్నారు.

ఉక్కునగరం : జివిఎంసి 87వ వార్డు పరిధిలో రూ.5.89 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాధంతో కలిసి మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఈ-సేవ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, గ్రేటర్ విశాఖ వ్యాప్తంగా ప్రధాన కాలువల నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. నగరంలో ఏ వార్డు చూసినా అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నాయని చెప్పారు. మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా ప్రజలు ఆశించిన ప్రగతిని అందించినట్లు అవుతుందన్నారు. క్రీడా మైదానాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు రౌతు శ్రీనివాస్, మొల్లి ముత్యాలనాయుడు, వార్డు టిడిపి అధ్యక్షుడు విజయరామరాజు, రాజన్ రాజు, ప్రకాష్, కూటమి నాయకులు సోంబాబు, బాబీ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు వర్క్‌షీట్ కార్యాచరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : పౌరగ్రంథాలయం, భారతీయ విద్యా భవన్ పబ్లిక్ స్కూల్ సంయుక్తంగా ప్రత్యేక నైపుణ్య ఆధారిత సృజనాత్మక పిల్లల కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. విశాఖపట్నంలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 70 మంది పిల్లలు పాల్గొన్నారు. సర్టిఫైడ్ కథకురాలు సీత శ్రీనివాస్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమం వర్క్‌షీట్ కార్యాచరణలతో ప్రారంభమైనది. పిల్లలు ఆకారాలను గీయడం, బొమ్మలను అనుసంధానం చేయడం, పాత్రలను కనుగొనడం తదితర నైపుణ్యాలను చూపించారు. ప్రతి ఒక్కరికీ ఒక ప్రత్యేక పాత్రను అప్పగించి, ఆ పాత్రల ఆధారంగా బృందాలుగా చేర్చారు. అనంతరం వారు బొమ్మలకు రంగులు వేసి తమ పాత్రల ఆధారంగా కథలు తయారుచేసి ప్రదర్శించారు. ఇందులో కేవలం కథకార్యక్రమం కాకుండా విజువల్ కోడింగ్, సృజనాత్మక ఆలోచన, బృంద సహకారం, కథన నైపుణ్యం ప్రజెంటేషన్ వంటి అనేక నైపుణ్యాలను ప్రోత్సహించారు.

ఇంటింటా 'సుపరిపాలనలో తొలి అడుగు'

ప్రజాశక్తి- యంత్రాంగం

అనకాపల్లి రూరల్: సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా 84వ వార్డు గొల్ల వీధి పరిసర ప్రాంతాల్లో మాజీ ఎమ్మెల్సీ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు పాల్గొని కూటమి నేతలతో కలిసి ఇంటింటికీ వెళ్లిప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పట్టణ శాఖ ఉపాధ్యక్షులు బోడి వెంకటరావు, కాంగ్రెస్ జగదీష్ ,నాగు పాల్గొన్నారు.

సుపరిపాలనలో తొలి అడుగు భాగంగా జిల్లాలో శతశాతం ఇళ్లకువెళ్లి ప్రజలతో మమేకమే కూటమి ఏడాది పాలనపై వివరించాలని టిడిపి జిల్లా అధ్యక్షులు తాతయ్య బాబు అన్నారు. అనకాపల్లి జిల్లాలో 5,19,709 ఇళ్లు ఉండగా, ఇప్పటివరకు 2,00,479 ఇళ్లకు వెళ్లి కరపత్రాలను పంచుతూ ప్రభుత్వ పథకాలను వివరించామన్నారు. నెలరోజుల కార్యక్రమంలో ఇప్పటివరకు 38.58 ఇళ్లను కవర్ చేశామని, గడువులోగా శతశాతం లక్ష్యాలను పూర్తిచేస్తామన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు ఉన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని రావిపాలెం గ్రామంలో ఆదివారం సుపరిపాలన తొలి అడుగులో భాగంగా మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్, టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు, రాష్ట్రకార్యదర్శి రాజాన రమేష్ కుమార్, మండల టిడిపి అధ్యక్షులు పీలా తులసి రాము ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ రాజాన నానాజీ, తమరాన అప్పలనాయుడు, బంటుపల్లి అప్పారావు, రంగళి మనోహర్, గొర్లి నూకరాజు,రావి కృష్ణ,గొర్లి రమణ, లోకనాథం నాగరాజు, పతివాడ చిన్నయ్య నాయుడు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలం రామవరంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. స్థానిక సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తాట్రాజు అప్పారావు, రామవరం సర్పంచ్ ఎర్ర పైడిరాజు, ఎంపిటిసి సభ్యులు గొలగాని కృష్ణ, తర్లువాడ సర్పంచ్ బిఆర్‌బి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

పడగ విప్పుతున్న డెంగీ!

- ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రికి రోజుకు ఐదారు కేసులు రాక
- జిల్లా వ్యాప్తంగా 30 నుండి 40 వరకు జ్వర పీడితుల నమోదు?
- చికిత్సలో అలసత్వం వహిస్తే ప్రాణ ప్రమాదమని వైద్యుల హెచ్చరిక

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : జిల్లాలో డెంగీ పడగ విప్పుతుందా? ఈ ఏడాది ఈ సీజన్లో డెంగీ ఫీవర్ ప్రభావం ఎక్కువగా కనిపిస్తుందా? అంటే అవుననేది వైద్య వర్గాల మాట. అనకాపల్లిలోని ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రికి రోజుకు ఐదారు డెంగీ కేసులు వస్తున్నాయి. నాతవరం పిహెచ్‌సి పరిధిలో ఏడు కేసులు నమోదైనట్లు డిఎంహెచ్‌ఒ తెలిపారు. జిల్లాలో రోజుకు సగటున 30 నుంచి 40 కేసులు నమోదు అవుతున్నట్లు తెలుస్తోంది. దీంతో జిల్లా ప్రజలు తీవ్ర భయాందోళన చెందు తున్నారు. డెంగీ జ్వరాలు విజృంభస్తున్న నేపథ్యంలో సరైన చికిత్స తీసుకోకపోయినా, సకాలంలో స్పందించకపోయినా ప్రాణాలకే ముప్పు వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

వర్షా కాలం ప్రారంభంలో పాతనీరు, కొత్తనీరు కలయికతో జ్వరాలు ఎక్కువగా వస్తూ ఉంటాయి. ప్రస్తుత వర్షాకాలంలో డెంగీ వైరస్ ప్రభావం రోజు రోజుకు పెరుగుతోంది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో డెంగీ లక్షణాలతో చికిత్స పొందుతుండటం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు ఈ వైరస్ ప్రభావానికి లోనవుతున్నారు.

డెంగీ వ్యాప్తికి కారణాలు

డెంగీ జ్వరం ఎడిస్ ఈజిప్టై అనే దోమ వలన వ్యాపిస్తుంది. వర్షాకాలంలో నీరు నిలిచిపోయే ప్రదేశాల్లో ఈ దోమలు ఎక్కువగా వృద్ధి చెందుతాయి. పానీకుండలు, కూలర్లలో నిలిచిన నీరు, అజాగ్రత్తగా పారవేయబడిన ప్లాస్టిక్ కవర్లు, కొబ్బరి బొండాలు, పాత టైర్లు వంటి వాటిలో ఈ దోమలు వృద్ధి చెందుతాయి.

ఎన్‌టిఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డెంగీ పీడితులు

డెంగీ లక్షణాలు

మోతాదుకు మించి జ్వరం, కడుపు నొప్పి, శరీరంలోని కండరాల నొప్పి, తల నొప్పి, కళ్ల వెనుక భాగంలో నొప్పి, చర్మంపై ఎరుపు పూతలు, వాంతులు, ప్లేట్‌లెట్లు తగ్గిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే డెంగీకు లోనైనట్లే. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టరును సంప్రదించడం చాలా అవసరం. ఆలస్యం చేస్తే హేమరేజిక్ డెంగీ (రక్తస్రావ డెంగీ) అయ్యే అవకాశం ఉంది. ఇది ప్రాణాలకు కూడా హాని కలిగించవచ్చు అని వైద్యులు చెబుతున్నారు.

సకాలంలో చికిత్స అవసరం

డెంగీ వైరస్‌కు లక్షణాల ఆధారంగా చికిత్స అందించడం ద్వారా రోగిని కాపాడవచ్చు. ముఖ్యంగా ప్లేట్‌లెట్ కౌంట్‌పై నిఘా పెట్టాలి. తీవ్రమైన కేసులలో రక్తాన్ని ఇవ్వాల్సిన అవసరం కూడా తలెత్తొచ్చు.

ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఇంటి చుట్టూ నీరు నిల్వ లేకుండా చూడాలి. పానీకుండలు, కూలర్లు శుభ్రంగా ఉంచాలి, పూర్తిగా చేతులు, కాళ్లను కప్పే బట్టలు ధరించాలి. దోమల నివారణకు క్రీమ్‌లు, దోమ తెరలు వాడాలి, శక్తినిచ్చే ఆహార పదార్థాలు తీసుకోవాలి, విటమిన్ సి, హైడ్రేషన్ మెరుగ్గా ఉంచుకోవాలి.

ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలు

గ్రామాలు, పట్టణాల్లో పారశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలి. నీరు నిలిచిన ప్రదేశాలను తొలగించడం, ఫాగింగ్, లార్విసైడ్ పిచికారీలు పెంచాలి. ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. అన్ని ఆసుపత్రుల్లో డెంగీ రోగులకు ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలి. రక్త పరీక్షలు, ప్లేట్‌లెట్స్ చెకప్‌లకు అవసరమైన పరికరాలు, మందులు అందుబాటులో ఉంచడం వంటివి చేయాలి.

జాగ్రత్తగా ఉండాలి

డెంగీ ఫీవర్ ప్రభావం క్రమేపీ పెరుగుతోంది. వ్యాధి సోకితే సకాలంలో చికిత్స తీసుకోవాలి. ప్రజలు, ప్రభుత్వం సమన్వయంతో వ్యవహరించకపోతే ప్రాణాలకే ముప్పు.

- డాక్టర్ డిడి నాయుడు, డైరెక్టర్,
అనకాపల్లి ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ

వైరల్ జ్వరాలే ఎక్కువ

వర్షా కాలం ప్రారంభంలో పాతనీరు కొత్త నీరు కలయిక, అపరిశుభ్రం వంటి వాటి వల్ల జ్వరాలు ఎక్కువగా వస్తాయి. ప్రస్తుతం వైరల్ జ్వరాలు ఎక్కువగా వస్తున్నాయి. అదే సందర్భంలో డెంగీ ఫీవర్స్ కనిపిస్తున్నాయి. నాతవరం పిహెచ్‌సి పరిధిలో ఏడు కేసులు నమోదయ్యాయి. డెంగీ జ్వరాల పట్ల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి.

- డాక్టర్ హైమావతి,
డిఎంహెచ్‌ఒ, అనకాపల్లి జిల్లా

27న బుద్ధునితో నా ప్రయాణం నాటక ప్రదర్శన

ఆహ్వాన కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈనెల 27న విశాఖ బుద్దిస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ భవన్‌లో 'బుద్ధునితో నా ప్రయాణం' నాటక ప్రదర్శన ఉంటుందని సిద్ధార్థ సోషల్ సర్వీస్ కల్చరల్ అసోసియేషన్, అధ్యక్షులు బల్లా నాగభూషణం తెలిపారు. ఆదివారం సంస్థ కార్యాలయంలో నాటక ప్రదర్శన కరపత్రాలను ఆవిష్కరించారు. అద్భుతమైన సెట్టింగులు, గ్రాఫిక్స్‌తో ప్రముఖ నాటక రంగకళాకారులు నాటకాన్ని ప్రదర్శిస్తారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వినకోట నీలేశ్ గుప్తా, ఉపాధ్యక్షులు పట్నాల కృష్ణ మోహన్, సభ్యులు కొత్తుర్తి రామారావు, బొడ్డు సోమరాజు, అయ్యావారం రమణమూర్తి, పొన్నా చల్మాజీ, అనకాపల్లి జిల్లా బుద్దిస్ట్ సొసైటీ ఉపాధ్యక్షులు సాపల నూకరాజు, కోశాధికారి బి.దయాల్‌రాజు, సభ్యులు బండి అప్పారావు పాల్గొన్నారు.

106 మందికి ఉచిత కంటి పరీక్షలు

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- విశాఖపట్నం: జివిఎంసి 85వ వార్డు పినమడక జెడ్‌పి హైస్కూల్‌లో ఆదివారం అమ్మ చారిటబుల్ ట్రస్ట్, టిడిపి వార్డు కమిటీ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరంలో 106 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. వార్డు టిడిపి అధ్యక్షుడు కర్రి దశేంద్రరావు, కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, ఎడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ శిబిరాన్ని ప్రారంభించారు. 106 మందికి కంటిపరీక్షలు చేయగా, 24మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసి, వెంటనే ప్రత్యేక బస్‌లో తరలించారు. శిబిరంలో ట్రస్ట్ చైర్మన్ గొంప వెంకటరావు, వైస్‌చైర్మన్ అర్జున, సభ్యులు గొల్లివిల్లి నూకరాజు (కమెండో), శంకర్ ఫౌండేషన్ వైద్య నిపుణులు డాక్టర్ డి.దీపక్, క్యాంప్ మేనేజర్ అరుణ్‌కుమార్, నర్సింగ్ స్టాఫ్ జె. దీపిక, వైద్య సిబ్బంది, స్థానిక యువత పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్‌కు 50మంది ఎంపిక

అనకాపల్లి: విశాఖ శంకర్ ఫౌండేషన్, అనకాపల్లి రాజా ఆప్టికల్స్ కంటి ఆసుపత్రి, సాయిరాజా వెల్ఫేర్ ట్రస్ట్, తుమ్మపాల గ్రామ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం తుమ్మపాల పోలమాంబ ఆలయంలో నిర్వహించిన ఉచిత నేత్ర శిబిరానికి స్పందన లభించింది. 200 మందికి కంటిపరీక్షలు చేయగా, 50 మంది శస్త్ర చికిత్సకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో డాక్టర్ అరుణ, శంకర్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ సతీష్, వర్కర్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఎరుబండి సత్యనారాయణ, మత్తుర్తి మహేష్, బాబురావు, గ్రామ పెద్దలు దంతులూరి దిలీప్ కుమార్, గ్రామ సర్పంచ్ కట్ట పెంటయ్య నాయుడు, బొడ్డపాటి చినరాజరావు పి హర శ్రీనివాసరావు, జిపి నాయుడు, పిడి గాంధీ పాల్గొన్నారు.

శిథిల వంతెనపై వాహన రాకపోకలపై ఆంక్షలు

శిథిల వంతెనపై ఏర్పాటు చేసిన స్టాపర్స్

ప్రజాశక్తి- దేవరాపల్లి : దేవరాపల్లి నుండి విశాఖపట్నం ప్రధాన రహదారిలో కృష్ణరాయుడుపేట వద్ద రైవాడ జివిఎంసి కాలువపై వంతెన శిథిలావస్థకు చేరుకుని ఎపుడు కూలుతుందో తెలియని ప్రమాదకర పరిస్థితిలో ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. శనివారం రాత్రి వంతెన పైభాగంలో ఇనుప నిర్మాణాలు పెళుసులు ఊడిపోతుండడంతో ప్రమాద తీవ్రతను గమనించి అధికారులు, ఆదివారం నుంచి వంతెనపై భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించారు. వంతెనపై స్టాపర్లను ఏర్పాటు చేశారు.

ఈ మార్గం ద్వారా నిత్యం వందలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, ప్రయాణికులు విశాఖ నుంచి దేవరాపల్లి, ఆనందపురం, వావిలపాడు, కాశీపురం సమీప గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఇపుడు వంతెన మూసివేతతో వారంతా ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడింది. విశాఖపట్నం నుంచి వచ్చే ఆర్‌టిసి బస్సులు కృష్ణరాయుడుపేట వద్దే ఆగిపోనున్నాయి. దీంతో మిగతా ప్రయాణాన్ని ఆటోలు, ఇతర వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉంది.

అన్‌రాక్ భారీ వాహనాల వల్లే మామిడిపాక బ్రిడ్జి శిథిలం

- అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పక్కనే ఎమ్మెల్యే కొణతాల

ప్రజాశక్తి -కశింకోట : పరిమితికి మించి బరువుతో భారీ వాహనాల రాకపోకల వల్లే తాళ్లపాలెం, నర్సీపట్నం వెళ్లే మార్గంలో మామిడిపాక బ్రిడ్జి ప్రమాదంలో పడిందని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. వారం రోజుల క్రితం ఆర్‌అండ్‌బి అధికారులు బ్రిడ్జి పరిస్థితిని పరిశీలించి, ప్రభుత్వానికి నివేదికను అందజేశారన్నారు. ఈనేపథ్యంలోనే ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణతో కలిసి స్పీకర్ అయ్యన్నపాత్రుడు బ్రిడ్జి స్థితిగతులను పరిశీలించారు.

ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ,. 20 టన్నుల బరువున్న వాహనాల రాకపోకలకు అనువైన వంతెనపై సామర్థ్యానికి మించి 60 టన్నుల పైబడి ముడిసరుకున్న వాహనాలను అన్‌రాక్ కంపెనీకి తరలించడం వల్లే నేడీ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుందన్నారు. తక్షణమే బ్రిడ్జి ప్రమాదాన్ని నివారించేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఆర్‌అండ్‌బి ఉన్నతాధికారులతో సంప్రదింపులు చేశామన్నారు. వారం రోజుల్లో సాంకేతిక నిపుణులతో బ్రిడ్జిని పరిశీలించి, వారి సూచనల మేరకు కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలా? లేదా మరమ్మతులు చేస్తే సరిపోతుందా అనే అంశాలపై నిర్ణయం తీసుకుంటామన్నారు. తాళ్లపాలెం నుంచి చింతపల్లి వరకు రోడ్డు విస్తరణకు కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరుకు కృషి చేయాలని ఎమ్మెల్యే కొణ తాల రామకృష్ణ కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు కాయలు మురళీధర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వైసిపికి కొలపర్తి రాజీనామా

కొలపర్తి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనకాపల్లి : వైసిపికి కొలపర్తి శ్రీనివాసరావు రాజీనామా చేశారు. ఆదివారం రాజీనామా పత్రాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్‌కు అందజేసినట్టు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాసరావు 2024 ఎన్నికల ముందు బిజెపి పట్టణ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి వైసిపిలో చేరారు. అయితే అక్కడ ఇమడలేక రాజీనామా చేసినట్టు తెలిపారు. త్వరలోనే కూటమిలో చేరే అవకాశం ఉందని సన్నిహితులు అంటున్నారు.

మొక్కలు నాటివేత

గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ అప్పారావు

ప్రజాశక్తి- అనకాపల్లి : మొక్కలు పెంచడం ద్వారా పచ్చదనంతో పాటు పర్యావరణం పరిరక్షణ అవుతుందని గ్రీన్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ అన్నారు. ఆదివారం మండలంలోని తగరంపూడి పిహెచ్‌సి ఆవరణలో గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో సర్పంచు యాదగిరి అప్పారావు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగేళ్ల కిందట గ్రామంలో గ్రీన్‌క్లబ్ నాటిన మొక్కలు ప్రస్తుతం వృక్షాలుగా ఎదిగాయన్నారు. వైస్ ఎంపిపి అయితా రాము, గ్రామ పెద్దలు చెల్లయ్య, కుంచు సూరయ్య శెట్టి, అన్న పంతుల శ్రీనివాసరావు, పేరూరి చిన్నస్వామి, మాణిక్యం, ఆనంద్, భువన గిరి రామకష్ణ, ఎర్ర చక్రవర్తి, నైశెట్టి సత్తిబాబు పాల్గొన్నారు.

సునీత ఆందోళనకు కూటమి మద్దతు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : తిమ్మరాజుపేట అంగన్వాడీ కార్యకర్తగా నియమిస్తానని ఎమ్మెల్యే ఇచ్చిన హామీ నెరవేర్చాలని దళిత మహిళ మంత్రి సునీత చేస్తున్న దీక్షలకు గ్రామ కూటమి నాయకులు మద్దతు తెలిపారు. ఆదివారం తిమ్మరాజుపేట దీక్షా శిబిరం వద్ద టిడిపి బిసి సెల్ అధికార ప్రతినిధి కర్రి అదిబాబు, ఎస్.శివ బాపునాయుడు, జనసేన నాయకులు శరగడము నాగార్జున, ఆడారి నర్సింగరావు , బిజెపి నాయకులు కర్రి జోగి నాయుడు, టిడిపి ఎలమంచిలి నియోజకవర్గం ఎస్‌సి సెల్ అధ్యక్షుడు రేవిడి కృష్ణ తదితరులు సునీతకు జరిగిన అన్యాయంపై మాట్లాడారు. విషయాన్ని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రికొల్లు రవీంద్ర, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, తదితరుల దృష్టికి తీసుకెళ్తామని, సునీతకు న్యాయం జరిగే వరకు ఆమె పోరాటానికి అండగా ఉంటామన్నారు.

ఎస్ఐగా సత్యనారాయణ

ప్రజాశక్తి- దేవరాపల్లి : దేవరాపల్లి ఎస్ఐగా వి.సత్యనారాయణ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల బదిలీల్లో పరవాడ పోలీస్ స్టేషన్ నుంచి ఇక్కడి వచ్చారు.. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ మల్లేశ్వరరావు అనకాపల్లి బదిలీ అయ్యారు.

వి.సత్యనారాయణ, ఎస్ఐ

రైతు బజారు ఏర్పాటు చేయాలని ధర్నా

ప్రజాశక్తి -అనకాపల్లి : పట్టణ ప్రజలకు అందుబాటులో ఉండేలా డీసీఎంఎస్ ఆవరణలో రైతు బజార్ ఏర్పాటు చేయాలని ఆదివారం ఆమ్ ఆద్మీ, సిపిఐ ఆధ్వర్యంలో కూరగాయల మార్కెట్లో ధర్నా నిర్వహించారు. అనకాపల్లి పరిసరాల గ్రామాల నుంచి 18 నుంచి 20 కిలోమీటర్ల దూరం నుంచి రైతులు తాము పండించిన కూరగాయలను అనకాపల్లికి తీసుకువచ్చి అమ్ముతుంటారని, వారికి సరైన చోటు లేక రోడ్డు పక్కల్లోనే ఎండవానల్లో ఇబ్బందులు పడుతూ అమ్మకాలు చేస్తున్నారన్నారు. వారి ఇబ్బందులతోపాటు ప్రజల అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని వెంటనే రైతుబజారు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆప్ కన్వీనర్ కొణతాల హరినాథ్ బాబు, సిపిఐ సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, బాబ్జీ, రైతులు పాల్గొన్నారు.

రైతు మూల సంఘం కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-మునగపాక: స్థానిక సంతబయలు వినాయక కల్యాణ మండపంలో ఆదివారం 'మూలబంద గోడి' రైతు మూల సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడుగా దొడ్డి నూకరాజు, కార్యదర్శిగా దాడి శివ నాగఅప్పారావు కోశాధికారిగా సూరిశెట్టి నాగ దుర్గనాయుడులు ఎన్నికయ్యారు. డైరక్టర్లుగా కుంచి గంగాధర్, దొడ్డి త్రినాథ్ ఎన్నికయ్యారు. మూల సంఘం నాయకులు దాడి సూర్యనారాయణ పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి. సమావేశంలో సంఘం సభ్యులు దాడి శివ, దొడ్డి గంగ సూరి, రామ అప్పల నాయుడు, బొడ్డేడ రామ నాయుడు, దాడి శ్రీరామ్మూర్తి, దొడ్డి సన్యాసి నాయుడు పాల్గొన్నారు.

శారద దిగువ ఆయకట్టుకు

'రైవాడ' నీటిని విడుదల చేయాలి

తుమ్మపాల గ్రోయిన్‌ను పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి -అనకాపల్లి : శారద దిగువ ఆయకట్టుకు రైవాడ నీటిని విడుదల చేయాలని సిపిఎం నాయకులు కర్రి అప్పారావు, కాళ్ల తేలయ్య బాబు కోరారు. ఆదివారం శారదానదిపై ఉన్న తుమ్మపాల గ్రోయిన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైవాడ నీటిని దిగువ ఆయకట్టుకు విడుదల చేయడం ద్వారా దేవరాపల్లి, కే కోటపాడు, చోడవరం, సబ్బవరం, ఎలమంచిలి, అనకాపల్లి, కసింకోట, మునగపాక, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో 11 వేల ఎకరాల ఆయకట్టుకు ప్రయోజనం ఉంటుందన్నారు. ప్రస్తుతం రైతులు విత్తనాలతో ఆకు మడులు వేస్తున్నారని, అయితే నీరు లేకపోవడంతో ఎద జల్లుతున్నారన్నారు. సకాలంలో నీరు అందకుంటే నారుమళ్ళ ఎండిపోయే పరిస్థితి ఉందన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రైవాడ నీటిని శారద దిగువ ఆయికట్టుకు విడుదల చేయాలన్నారు. అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ కృషితో శారదా నది గ్రోయిన్ల పూడికతీతకు రూ.2.37కోట్ల నిధులు విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ, ఈ నిధులతో గ్రోయిన్లను పూర్తిస్థాయిలో బాగుచేయాలన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

చెక్ అందజేస్తున్న గండి బాబ్జి

ప్రజాశక్తి -సబ్బవరం : అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని మల్లునాయుడు పాలెం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నేత రావిపల్లి నాయుడు కుమారుడు పైడం నాయుడుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.2,01,607 చెక్కును పెందుర్తి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి గండి బాబ్జి అందజేశారు. ఆదివారం మొగలిపురం గ్రామంలో రావిపల్లి పైడంనాయుడుకు సాయం అందజేశారు. పైడంనాయుడు అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని పిఎసిస్ చైర్మన్ గండి దేముడు ద్వారా తెలుసుకున్న బాబ్జి, ఈ మేరకు సాయం మంజూరుకు కృషి చేసి, అందజేశారు. కార్యక్రమంలో బలిరెడ్డి అప్పారావు, ఉప సర్పంచ్ సూర్యప్రసాద్, అప్పారావు, బలిరెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.

చోడవరం :సీఎం సహాయనిధి నుంచి మంజూరైన సాయం రూ. 9,53,869 విలువైన చెక్కులను13 మందికి ఆదివారం తమ కార్యాలయంలో ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు అందజేశారు. రావికమతం మండల పార్టీ అధ్యక్షుడు శంకర్, గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, పుల్లేటి శంకర్ పాల్గొన్నారు .

సేవా కార్యక్రమాలతో శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -సబ్బవరం. : మండలంలోని తవ్వవానిపాలెం గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త బోకం శ్రీనివాస్ జన్మదిన వేడుకలు సర్పంచ్ బోకం స్వామి నాయుడు, శ్రీనివాస్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు లక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్ అధినేత, పారిశ్రామికవేత్త చొక్కాకుల వెంకటరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ యువ నాయకుడు బోకం శ్రీనివాస్ తన సంపాదనలో కొంత భాగం గ్రామాభివృద్ధికి వినియోగిస్తూ, ఆలయాలు, సిసి రోడ్లు, ఇతర సేవా కార్యక్రమాలకు వినియోగించడం ఆనందదాయకం అన్నారు. చొక్కాకుల వెంకటరావు, శ్రీనివాస్ తల్లిదండ్రులు అప్పలనాయుడు నారాయణమ్మ దంపతులు పుట్టినరోజు కేకును కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు.

శ్రీనివాస్ సోదరులు గ్రామ సర్పంచ్ బోకం స్వామి నాయుడు మాట్లాడుతూ శ్రీనివాస్ పుట్టినరోజున సబ్బవరం శివాలయం అభివృద్ధికి రూ.లక్ష, టెక్కలి పాలెం రామాలయం నిర్మాణానికి రూ.50వేలు, వంగలిలో అమ్మవారి ఆలయ నిర్మాణానికి రూ.50వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మండలంలోని ఆరిపాక, రావలమ్మపాలెం, మల్లునాయుడుపాలెం, నంగినారపాడు, తవ్వవానిపాలెం జెడ్‌పి హైస్కూల్, సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. పంచాయతీ పాలకవర్గానికి గ్రామాభివృద్ధికి రూ. 50 వేల ఆర్థిక సహాయంగా అందజేశారు.శ్రీనివాస్ సొంత నిధులతో గ్రామంలో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేస్తున్నట్లు వెల్లడించారు. గ్రామంలో 150 కుటుంబాలకు 25 కేజీల బియ్యం బస్తాలను పంపిణీ చేశారు. సహపంక్తి విందు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు మిడతాడ మహాలక్ష్మి నాయుడు, కర్రి కనకరాజు,ఉప సర్పంచ్ వనం దేముడు బాబు,రొంగలి దేముడు, శ్రీరం అప్పలరాజు, అక్కిరెడ్డి దుర్గి నాయుడు,గొర్లి నూకరాజు, పైల వెంకట రమణ, పంచాడ శ్రీనివాసరావు, ఆకుల గణేష్, జెట్టి ప్రసాద్, హేమంత్, పల్లి మంగరాజు,టీ శేఖర్, జెట్టి ప్రసాదు, పల్ల రమణ పాల్గొన్నారు.

శ్రీనివాస్ జన్మదిన వేడుకల్లో మాట్లాడుతున్న వెంకటరావు

టిడిపి మండల అధ్యక్షునికి అభినందన

తులసి రామును సత్కరిస్తున్నమాజీ ఎంపీ చలపతిరావు

ప్రజాశక్తి- అచ్యుతాపురం : మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా ఎన్నికైన పీలా తులసీరామును ఆదివారం అచ్యుతాపురంలో మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్ ఘనంగా సత్కరించారు. తులసి రాము జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి, తినిపించారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పిసిహెచ్ నాయుడు, లాల రాము, తమరాల తాతబాబు, రాజన్న నానాజీ పాల్గొన్నారు.

భారీ వర్షాలపై అప్రమత్తత

ప్రజాశక్తి -అనకాపల్లి : పిడుగులతో కూడిన మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. చెట్లక్రింద, శిథిలావస్థలో ఉన్న గోడలు, భవనాలు దగ్గర నిలబడరాదన్నారు. విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు,కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలో ఎ.కొత్తపల్లి రాళ్లకట్టు దగ్గరనుంచి వారాడ ఎర్రి నాయుడు చెరువు వరకు కొత్తూరు కాలువ పూడిక తీత పనులు రైవాడ రిజర్వాయర్ చైర్మన్ పోతల ఫాతిరినాయుడు, వైస్ చైర్మన్ ఆదివారం ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రైవాడ జలాశయ అభివృద్ధికి మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి నిధులు మంజూరు చేయించారన్నారు. కాలువలో తుప్పులు, పూడికలు పేరుకుపోవడంతో దిగువ ఆయకట్టుకు నీరందని పరిస్థితి ఉందని, మంజూరైన నిధులతో పనులు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డిఇఇ సత్యం నాయుడు, జెఇఇ నందకిశోర్, టిసి సభ్యులు, రైతులు పాల్గొన్నారు

ఘనంగా మోదకొండమ్మ పండగ

ప్రజాశక్తి - కశింకోట: కశింకోట శారదా నది అవతల ఉన్న మోదకొండమ్మ పండగ ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆర్‌టిసి మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీను, వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతితోపాటు పలువురు భక్తులు అమ్మవారికి పూజలు చేశారు.

ఎమ్మెల్యేను కలసిన ఆర్‌టిసి ఇడి

ప్రజాశక్తి-అచ్యుతాపురం :స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌ను ఆదివారం ఆయన స్వగృహంలో ఆర్‌టిసి ఒకటోజోన్, విజయనగరం కె బ్రహ్మానంద రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సరిపడా బస్సులను నడిపేలా చర్యలు తీసుకోవాలని ఇడికి ఎమ్మెల్యే సుందరపు సూచించారు. అనకాపల్లి జిల్లా ప్రజా రవాణా అధికారి వి ప్రవీణ ఉన్నారు.

సామూహిక వ్రతాలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని దేవరాపల్లిలోని సత్యసాయి ధ్యాన మందిరంలో ఆదివారం సామూహిక సత్యసాయివ్రతాలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన 200 మందికి పైగా భక్తులు వ్రతాల్లో పాల్గొన్నారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కొసిరెడ్డి అప్పలనాయుడు ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. జోనల్ ఇన్‌చార్జ్ జి. రవిశంకర్, సాయిసేవా సమితి ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

సొంత నిధులతో చేయూత

సాయం అందజేస్తున్న రాజు, దాత బాబూరావు

ప్రజాశక్తి- వడ్డాది : బుచ్చయ్యపేట మండలం పొట్టిదొరపాలెం గ్రామంలో జనసేన మండల ప్రధాన కార్యదర్శి మండపాక బాబూరావు తన సొంత నిధులతో ఇటీవల మృతి చెందిన ఆరు కుటుంబాలకు రూ.12వేలు ఆర్థికసాయం అందజేశారు. ఇటీవల మరణించిన బొబ్బిలి అప్పారావు, మొల్లి చెల్లయ్య, వద్దీ కళ్యాణం, సంబారు నారాయణమ్మ, బూర శ్రీరామ్, పల్లా రాము కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.రెండు వేలు చొప్పున నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్.రాజు ద్వారా అందించారు. పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో తానీ సాయం చేసినట్లు బాబూరావు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు డి.ఎస్ నాయుడు, బలిజ మహారాజు, బుదిరెడ్డ అరుణ్, కందిపూడి గోవింద్, ముచ్చకర్ల నగేష్, వడ్డి గణేష్, కోన రమణ, చింతల కిషోర్, రత్నాజీ పాల్గొన్నారు

రామారావుపేటలో అపారిశుధ్యం

▶▶ రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు ▶▶ అవస్థలు పడుతున్న పాదచారులు, వాహనదారులు

ప్రజాశక్తి -నర్సీపట్నం:ఇటీవల స్వచ్ఛ సర్వేక్షన్ 24-25 ఫలితాలలో నర్సీపట్నం మున్సిపాలిటీ ఓడిఎఫ్ పేరును దక్కించుకుంది. జాతీయంగా 553వ ర్యాంక్, రాష్ట్రంలో 30 వరకు సాధించినట్లు అధికారులు వెల్లడించినా ఓడిఎఫ్ ప్లస్ సాధించడం శుభ సూచకమే అయినా క్షేత్ర స్థాయిలోకి వెళ్తే అపారిశుధ్యం తాండవిస్తోంది.

నర్సీపట్నం నియోజకవర్గ కేంద్రంలో స్పీకర్ అయ్యన్న ఇలాకాలో రామారావు పేటలో మురుగు నీరు రోడ్డపైకి ప్రవహిస్తోంది. దీంతో, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. చెత్తను తొలగించక పోవడంతో ఆ ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

మురుగునీటి కాలువలో చెత్తాచెదారం

టున్నారు. సమీపంలోనే విద్యాసంస్థలు సహా పలు బ్యాంకుల సముదాయం, ప్రైవేటు హాస్పిటల్స్ ఉన్నాయి. రద్దీగా ఉండే ఈ ప్రదేశంలో మురుగు నీరు రోడ్డుపైకి ప్రవహించడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో, దోమల బెడద అధికంగా ఉంటుందని ఆయా ప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు. నడిచి వెళ్లే పాదచారులు సైతం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయా ప్రాంత వాసులు కోరుతున్నారు.

పంటలు పండించేదెలా?

▶▶ మరమ్మతుకు నోచని చెక్‌డ్యాములు
▶▶ కాలువల్లో పేరుకుపోయిన పూడిక
▶▶ సాగు నీరు అందక ఆందోళన చెందుతున్న రైతులు

ప్రజాశక్తి-గొలుగొండ:నాలుగేళ్లుగా చుట్టుబంధ గ్రామంలో తొలుకుల గెడ్డ రిజర్వాయర్ మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో, రెండు వందల ఎకరాల్లో సాగు చేసే రైతులు పంటలు పండించుకునేందుకు నీరు అందక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొయ్యూరు మండలం కినపర్తి పంచాయతీ చుట్టుబంధంలో ఉన్న తొలుకులగెడ్డ రిజర్వాయర్ ఉంది. ఈ రిజర్వాయర్ పై వలసంపేట, భీమవరం, చుట్టుబంద, రిట్టమానుపాలెం తదితర గ్రామాలు రైతులు సుమారుగా 200 ఎకరాలు పైగా వరి, మిరప, వంగ, పత్తి, టమాట, సాగు చేస్తున్నారు. గిరిజన ప్రాంతంలో సాగు చేసుకునే రైతులకు ఈ రిజర్వాయర్ రైతులకు ఎంతగానో ఉపయోగపడేది. నాలుగేళ్లుగా ఈ రిజర్వాయర్, రెండు చెక్ డాములు మరమ్మతులకు గురై రిజర్వాయర్లో నీరు పంట కాలువలకు వెళ్లే పరిస్థితి లేదు. దీనికి తోడుగా పంట కాలువలు కూడా ఏళ్ల తరబడి పూడిక తీతలు తీయక పోవడంతో పలుచోట్ల కాలువలు గండి కొట్టి అధ్వానంగా మారిందని రైతులు అంటున్నారు.

ఈ విషయమై పలుమార్లు సంబంధిత ఇరిగేషన్, ఉపాధి హామీ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించ లేదని రైతులు వాపోతున్నారు. వర్షాభావంలో పంటలను కష్టంగా సాగు చేసుకోవలసిన పరిస్థితులు వచ్చాయని రైతులు అంటున్నారు. రిజర్వాయర్ వినియోగంలో ఉంటే నష్టాలు వచ్చినప్పుడు ఈ నీరు వాడుకొని లాభాల బాటలో ఉంటామన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెక్ డాములు మరమ్మత్తులు, పంట కాలువల పూడికతీతలు చేపట్టాలని రైతులు రుత్తల రామకృష్ణ, మల్లేశ్వరరావు, గోవింద, కోరుతున్నారు.

గెడ్డ వద్ద రైతులు

మోదకొండమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే, హౌసింగ్ ఛైర్మన్

ప్రజాశక్తి మాడుగుల: కెజె పురం గ్రామదేవత మోదకొండమ్మ జాతర సందర్భంగా శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్య బాబుతో కలిసి ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన వారికి ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ రాపేటి జోగినాయుడు కమిటీ సభ్యులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు, మండల అధ్యక్ష కార్యదర్శులు అడ్డేపల్లి జగ్గారావు,ఉండూరు దేవుడు, ఆలయ కమిటీ ఛైర్మన్ బొడ్డేటి సురేష్, నందారపు సన్యాసిరావు, వడ్డీ రాజ్ కుమార్, ఎల్లపు రాము, సర్పంచ్ జామి రమణబాబు, బొబ్బి భీశెట్టి విజయలక్ష్మి, కాళ్ళ అప్పారావు పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, ఛైర్మన్

వినతిపత్రాన్ని ఇస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ యూనిట్ ప్రతినిధుల వినతి

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: మాకవరపాలెం మండలం ఏరకన్నపాలెంలో అక్రమంగా నిర్మిస్తున్న రోడ్డును అడ్డుకున్న అటవీ అధికారుల పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని జిల్లా అటవీశాఖ అధికారి శామ్యూల్‌కు ఆంధ్ర ప్రదేశ్ జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ యూనిట్ ప్రతినిధులు నర్సీపట్నంలో ఆదివారం వినతిపత్రం అందించారు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపై దాడి చేసి స్వాధీనం చేసుకున్న వాహనాలను అక్రమంగా తరలించకపోయారన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని వారు వాపోయారు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులకు సరైన రక్షణ లేకపోతే ఎలాగని ప్రశ్నించారు. ఫిర్యాదు చేసిన వారిలో ఆంధ్ర ప్రదేశ్ జూనియర్ అటవీ అధికారుల అసోసియేషన్ నర్సీపట్నం యూనిట్ ప్రెసిడెంట్ సింహాచలం, వైస్ ప్రెసిడెంట్ కిరణ్, జనరల్ సెక్రటరీ బాబూరావు, గోపి, సంధ్యారాణి తదితరులు ఉన్నారు.

సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పార్ట్ టైం ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి -మాడుగుల:మాడుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఆర్ట్, క్రాఫ్ట్, వ్యాయామ విభాగాల పార్ట్ టైం ఉపాధ్యాయులకు బదిలీ కావడంతో ఆదివారం ఘనంగా సత్కరించారు.తక్కువ వేతనాలతో పని చేస్తున్న వీరికి ఈపిఎఫ్, హెచ్ఆర్ పాలసీ, గ్రాట్యూటీ వంటి లబ్ధి కల్పించాలని అనకాపల్లి జిల్లా యూనిటీ యూనియన్ జిల్లా అధ్యక్షులు నల్లబిల్లి నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు.

పండుగను నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా మరిడమ్మ పండగ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో ఉపమాక గ్రామంలో ఆదివారం మరిడమ్మ తల్లి పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు పసుపు,కుంకుమ సమర్పించారు. అమ్మవారి పండుగ సందర్భంగా మహిళల కోలాట ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది.

వైభవంగా అమ్మవారి సారె ఊరేగింపు

నక్కపల్లి:మండలంలో రేబాక గ్రామంలో ఆషాఢమాసం చివరి ఆదివారం సందర్భంగా గూడపమ్మ తల్లి సారె ఊరేగింపు వైభవంగా జరిగింది. నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్ రాయవరం, కోటవురట్ల మండలాల్లో గల పలు ప్రాంతాల నుంచి, రేబాక పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు తరలివచ్చి, అమ్మవారికి సారె సమర్పించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. కోటవురట్ల మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన పిల్లల కోలాటం ప్రదర్శన విశేషంగా అలరించింది. ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

టిడిపి నేత మోది నాయుడు మృతి

ప్రజాశక్తి -మాడుగుల: మాడుగుల గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మరిడిమాంబ రైతు సంఘం సభ్యుడు, ఆటో యూనియన్ కార్యవర్గ సభ్యుడు భీశెట్టి మోది నాయుడు శనివారం రాత్రి మృతి చెందారు. 1990 నుండి తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా ఆయన కొనసాగుతూ, గ్రామస్థాయిలో పార్టీకి విశేష సేవలందించారు.మంచితనంతో, వినమ్రతతో కార్యకర్తల మన్ననలు పొందారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, మండల అధ్యక్ష, కార్యదర్శి అద్దేపల్లి జగ్గారావు, ఉండూరు దేవుడు, పట్టణ అధ్యక్షులు పుప్పాల లక్ష్మీనారాయణ, రంజిత్ వర్మ, లెక్కల కాశీ బాబు, వైసిపి మండల ఉపాధ్యక్షులు పొలిమేర విజయలక్ష్మి, సర్పంచ్ యడ్ల కళావతి, జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రావు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు సంతాపం వ్యక్తం చేశారు.

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: స్థానిక కృష్ణ ప్యాలెస్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జీ అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లా కేంద్రంగా డిగ్రీ విద్యార్థులకు ఒక్క ఎంఎల్ కాలేజీ తప్ప ప్రభుత్వం డిగ్రీ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ వసతి గృహాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. దీంతో విద్యార్థులు ప్రైవేటు హాస్టల్సును ఆశ్రయించడం లేదా రూము తీసుకొని ఉంటున్నారన్నారు. పలుచోట్ల సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కాలం గడుపుతున్నాయని తెలిపారు. అనకాపల్లి జిల్లా కేంద్రంగా ప్రభుత్వ మహిళ హాస్టల్స్ ఏర్పాటు చేయాలని, జిల్లాలో నూతనంగా యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జగదీష్, సింహాద్రి, ప్రసాద్, సింహాద్రి, జస్వంత్, ధర్మ, పండు పాల్గొన్నారు.

బాల నటుడు అరుణ్‌దేవ్‌ను అభినందిస్తున్న గణబాబు

బాల నటుడు అరుణ్‌దేవ్‌కు అభినందనలు

ప్రజాశక్తి -గోపాలపట్నం : గోపాలపట్నం సమీపంలోని నాయుడు తోట ప్రాంతానికి చెందిన బాలనటుడు అరుణ్‌దేవ్ తెలంగాణా ప్రభుత్వ బాల నటుడి అవార్డు పొందడంతో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు అభినందించారు. అరుణ్‌దేవ్ నటించిన మొట్టమొదటి సినిమా "35 చిన్న కథ కాదు"లో అద్భుత నటనా కౌశల్యానికి ఉత్తమ బాల నటుడిగా గద్దర్ అవార్డుతో సత్కరించిన సందర్భాన్ని పురస్కరించుకుని గోపాలపట్నం కళాసేవా పీఠం ఆధ్వర్యాన గణబాబు కార్యాలయంలో బాలుడ్ని సత్కరించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ మన ప్రాంతీయుడైన అరుణ్‌దేవ్ నటించిన మొట్టమొదటి సినిమాతోనే అవార్డు అందుకోవడం మనందరికీ గర్వకారణం అన్నారు. ప్రస్తుతం ఏడో తరగతి చదువుతున్న అరుణ్‌దేవ్ అటు నటనలోనూ ఇటు చదువులోనూ ఉన్నతంగా రాణించి అందరికీ ఆదర్శప్రాయంగా నిలవాలని, జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, మన ప్రాంతానికి మరింతగా పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆకాంక్షించారు కార్యక్రమంలో కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు నందవరపు సోములు, గౌరవాధ్యక్షులు చందు సుబ్బారావు, అధ్యక్ష కార్యదర్శులు గొరపల్లి బంగార్రాజు, కొంతం నూకరాజేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఎంఎన్‌వి.శ్రీనివాసరావు, ఆర్గనైజర్ కొప్పిశెట్టి వెంకట్, గౌరవ సలహాదారులు తాండ్రంగి రామారావు, మిద్ది అప్పారావు, మాజీ అధ్యక్షులు గొరకల రామదాసు, సభ్యులు నవీన్ పెద్దమల్ల, టి.రామచంద్రరావు, విశ్వేశ్వరరావు, ముదపాక శివ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయకుంటే

మరో విద్యుత్ ఉద్యమం

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రజలకు గుదిబండలా మారుతున్న అదానీ స్మార్ట్ మీటర్లను రద్దు చేయకపోతే మరో విద్యుత్ ఉద్యమానికి నాంది పలుకుతామని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం హెచ్చరించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టమని చెప్పిన ప్రస్తుత మంత్రి లోకేష్ తిరిగి వాటినే బిగించాలని చెప్పడం సిగ్గుచేటని మండిపడ్డారు. విద్యుత్ ఛార్జీలు పెరుగుదల, స్మార్ట్ మీటర్ల ప్రమాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న అధ్యక్షతన విస్తృతస్థాయి సమావేశంలో లోకనాథం మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అదానీతో చేసుకున్న స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దుచేసుకోవాలని ఆందోళన చేసిన కూటమి ప్రభుత్వం అదే ఒప్పందాన్ని అమలు చేయడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే ట్రూఅప్, ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో మోయలేని భారాలు వేసిన ప్రభుత్వాలు, ఇపుడు స్మార్ట్ మీటర్లలో నిండా ముంచేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు స్మార్ట్‌మీటర్లు బిగించడానికి ఎవరైనా వస్తే వ్యతిరేకించండని పిలుపునిచ్చారు. అదనపు వ్యయానికి కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించి, ప్రజలకు జవాబు చెప్పాలని , సర్దుబాటు చార్జీల ప్రతిపాదనలను ఉపసంహరించుకుంటూ నియంత్రణ మండలికి లేఖ రాయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.జగ్గునాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, గనిశెట్టి సత్యన్నారాయణ పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

అచ్యుతాపురం : ఇళ్లకు అదాని స్మార్ట్ మీటర్ల బిగించడానికి తీవ్రంగా వ్యతిరేకించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిపిఎం అచ్చుతాపురం కన్వీనర్ ఆర్ రాము పిలుపునిచ్చారు. ఆదివారం వెదురువాడ సాయి ప్రియ లేఔట్‌లో మార్నింగ్ వాక్ సమయంలో స్టిక్కర్లు, కరపత్రాలను పంచుతూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో వాకర్స్ నర్మాల అబ్బాయి నాయుడు, కర్రి వెంకునాయుడు, ద్వారపురెడ్డి రాజు, బి శ్రీనివాసరావు, రెడ్డి పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 28వ వార్డు పితాని దిబ్బ, భానుజీ నగర్, గంజిపేట ప్రాంతాల్లో సిపిఎం జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ స్టిక్కర్లు అంటించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు వై.రాజు, కె.నర్సింగరావు, ఆర్.గోవిందరావు, దానయ్య, గణేష్, చంద్రమౌళి పాల్గొన్నారు.

గాజువాక : స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరుతూ సిపిఎం గాజువాక జోన్ కమిటీ ఆధ్వర్యాన జివిఎంసి 67వ వార్డు పరిధి జోగవానిపాలెంలో, 76వ వార్డు పరిధి స్వతంత్ర నగర్‌లో, అప్పన్న కాలనీలో పాదయాత్రలు చేశారు. సిపిఎం జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, నాయకులు కె.సంతోషం, ఎం.అప్పారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అదాని స్మార్ట్ మీటర్లు ప్రమాదాన్ని ప్రజలకు తెలియజేస్తూ సిపిఎం ఆధ్వర్యాన కొత్త గాజువాక రైతు బజార్ వద్ద ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ, ఈ స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలకు చాలా నష్టాలు ఉన్నాయన్నారు. ఆర్.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.నాగేశ్వరరావు, టి.శ్రీనివాస్, బి.శ్రీనివాస్, వి.మల్లేష్, త్రినాధ్, సిహెచ్.అప్పారావు, శివానంద్ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకిస్తూ గాజువాక మహిళా రైతు బజారులో సిపిఐ నాయకులు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, నాయకులు కె.వనజాక్షి, జి.ఆనంద్, కె.అచ్యుతరావు, అప్పారి విష్ణుమూర్తి, పిల్లా పద్మ పాల్గొన్నారు.

గాజువాకలో సిపిఎం నేతల ప్రచారం

మాధవధార : జివిఎంసి 50, 51వ వార్డుల పరిధి ఏకలవ్యకాలనీ, తెన్నేటినగర్, మాధవధార తదితర ప్రాంతాలలో సిపిఎం నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూన సత్యనారాయణ, సనపల రామ్‌గోపాలరావు, కె.సుధాకర్, కె.పార్వతి, భవాని, ఎస్.అమలమ్మ, చిలకమ్మ, నర్సింగరావు, జివిఎన్.మూర్తి, శ్రావణ్ కుమార్, గోపాలకృష్ణ, కె.పాపారావు, రవి తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : జివిఎంసి 60వ వార్డు పరిధి హనుమాన్ సంజీవి కాలనీలో సిపిఎం ఆధ్వర్యాన పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికి స్టిక్కర్లు అతికిస్తూ కరపత్రాలు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మల్కాపురం జోన్ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, కె.రమణ, ఎం.శ్రీనివాస్, ఎస్‌కె.సుభాని, ఉమ్మడి రాజారావు, జి.రామకృష్ణ, ఎ.ప్రశాంత్, ఈశ్వరరావు, సురేష్, బి.కుమార్, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మాధవదారలో..

శిథిల కల్వర్టుపై భారీ వాహనాల రాకపోకలు

- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి: రావికమతం:మండలంలో దాసరయ్య పాలెం నుండి మరుపాక గ్రామానికి వెళ్లే మలుపులో చిన్నపాటి కల్వర్టు శిధిలావస్థకు చేరుకుంది. అయినా ఈ కల్వర్టుపై భారీ వాహనాలు రాకపోకలు సాగించడం గమనార్హం.

కల్వర్టు శిథిలావస్థలో ఉండటంతో రావికమతం మండల కేంద్రం నుంచి మరుపాక ఆదర్శ పాఠశాలకు విద్యార్థులను తీసుకువెళ్లే ఆర్టీసీ బస్సు సైతం నిలుపుదల చేశారు. అధికారులు కూడా దాసరయ్యపాలెం నుంచి మరుపాకకు వెళ్లే మార్గంలో భారీ వాహనాలు వెళ్ళకూడదని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ ఈ మార్గం గుండా భారీ లారీలు వెళ్ళడంతో కల్వర్టు పూర్తిగా కూలి పోయే ప్రమాదంలో ఉంది.

కల్వర్టు వద్ద ఏర్పడిన భారీ గొయ్యి

కల్వర్టు వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

మండలంలో 28 పంచాయతీల నుండి మరుపాక ఆదర్శ పాఠశాలకు ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులు ప్రతిరోజు ఈ మార్గం గుండానే ప్రయాణాలు సాగిస్తుంటారు. ఆదర్శ పాఠశాల విద్యార్థులను దాసరయ్యపాలెం వరకు ఆర్టీసీ బస్సులో తీసుకువచ్చి అక్కడ దించేస్తున్నారు. అక్కడ నుంచి రెండు కిలోమీటర్ల మేర విద్యార్థులు మరుపాక ఆదర్శ పాఠశాలకు నడుచుకొని వెళ్లవలసిన పరిస్థితి నెలకొంది. కల్వర్టు పూర్తిగా కూలి పోతే స్కూలుకు వెళ్లే మార్గం లేక పూర్తిగా రాకపోకలు నిలిచి పోతాయి. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి ఈ రహదారి గుండా భారీ వాహనాలు వెళ్ళకుండా చూడాలని, తక్షణమే నూతన కల్వర్టు, రోడ్డు పనులను ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.